


విక్టోరియా టాకీసు వద్ద బస్ కోసం వెయిట్ చేస్తూ నిలబడి అరగంటకు పైగానే అయింది. అన్ని నంబర్ల బస్సులు వస్తూ పోతున్నాయి గానీ అయిదో నెంబరు బస్సు మాత్రం రావడంలేదు.

దూరంగా నా కొలీగ్ వర్మ వస్తూ కనిపించాడు.

''హల్లో వర్మా ! ఇంటికేనా?'' విష్ చేస్తూ అడిగాను.

''అవునోయ్'' వర్మ సమాధానం.

మా వీధిలోనే వర్మవాళ్ల యిల్లు. ''రావోయ్! బస్‌లో వెళ్ళిపోదాం'' అన్నాను బోర్ కొడుతున్న నాకు కంపెనీ యిస్తాడు గదా అని.

''సారీ బ్రదర్! యివాళ కాస్త అర్జెంటు పనుంది. అందుకే నడిచే వెళ్తున్నాను!'' అంటూ వెళ్ళిపోయాడు వర్మ.

సిటీబస్సులమీద వర్మవేసిన జోకుకి నా చుట్టు ప్రక్కలవాళ్లుగూడా నగలబడి నవ్వారు.

అంతలోనే రోడ్డుమీది దుమ్మునంతా రేపుకొంటూ వచ్చి ఆగింది ఐదో నెంబరు బస్సు. ముగ్గురిని మాత్రమే ఎక్కించుకొని వచ్చినంత స్పీడుగా వెళ్ళిపోయింది. ఆ బస్సు డ్రైవరును, కండక్టరును తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ నిలబడ్డాను!

మెల్లిగా బుక్ స్టాల్ వైపుకు నడిచాను. బుక్ స్టాల్ దగ్గర నిలబడ్డ ఆమెను చూసి కనురెప్ప వేయడం మరిచాను.

తెల్లని టెరిన్ వాయిల్ చీర, తెల్లని పాలిస్టర్ లోనెక్ జాకెట్టు, మెడలో తెల్లని ముత్యాలహారం, చేతికి తెల్లరంగు బెల్టుకల రికో వాచి, రెండో చేతికి తెలుపు సాదా గాజులు, వాలుజడలోంచి తొంగి చూస్తున్న తెల్లని గులాబీ పువ్వు — మొత్తానికి దేవతలా మెరిసిపోతోంది.

ఆమె నాలాగే ఏదయినా ఆఫీసులో జాబ్ చేస్తోందేమో ! అన్న నా ఆలోచన సరయింది

గాదన్నట్లు ఆమె చేతిలోని కాలేజీ బుక్సు చెప్పకనే చెపుతున్నాయి!

బుక్‌స్టాల్‌లో ఆమెకు కాస్త ఎదురుగా నిలబడి పత్రికలు చూడసాగాను. నా చూపులు చేతిలోని పుస్తకంమీద వున్నాయి గానీ, మనసంతా ఆమెమీదే వుంది.

అంతవరకూ తీరిగ్గా నిలబడ్డ ఆమె హటాత్తుగా పుస్తకాలందుకొని వెళ్ళిపోయింది. ఎందుకయి వుంటుందా అని వెనక్కి తిరిగిచూసిన నాకు దూరంగా అయిదోనెంబర్ బస్ వస్తూ కనిపించింది. అంత తొందరగా వూడి పడ్డ ఆ బస్‌మీద కోపం కలిగింది.

ఆ అమ్మాయి కనిపించనంత వరకూ రాని బస్‌ను తిట్టుకొంటూ నిలబడ్డాను. ఇప్పుడేమో బస్ వస్తున్నందుకు తిడుతున్నాను. నాలో నేనే నవ్వుకొంటూ బస్‌వైపుకు కదిలాను.

అతి కష్టంగా బస్‌లో నిలబడటానికి చోటు దొరికింది. బస్ కదిలింది. వెనక్కి తిరిగి చూసిన నాకు బ్లడ్‌ప్రెజర్ పెరిగినట్లనిపించింది. కారణం బస్‌స్టాప్‌లోని సుందరి సరిగ్గా నా వెనకే నిలబడి వుంది.

బస్ స్లో అయినప్పుడు, టర్న్ అవుతున్నప్పుడు ఆ అమ్మాయి శరీరం నాకు తగులుతోంది.

బస్‌కు మేకపిల్ల అడ్డురావడంతో సడన్ బ్రేకు వేసాడు డ్రైవర్. అనుకోని కుదుపుకు నామీద తూలిపడిందా అమ్మాయి. మనసులోనే ఆ డ్రైవర్‌కు థ్యాంక్సు చెప్పుకొన్నాను.

అంతలో విజయా గార్డెన్స్ రావడంతో దిగలేక దిగలేక బస్ దిగాను. సిగరెట్ తీసుకొందామని కిళ్ళీ కొట్టుకెళ్ళి సిగరెట్ తీసుకొని జేబులో చెయ్యిపెట్టిన నాకు గుండెలు ఝల్లుమన్నాయి. జేబులో వుండ వలసిన పర్సు లేదు.

బస్‌లో కండెక్టరు యిచ్చిన చిల్లరను పర్సులో వుంచుకొనడం బాగా గుర్తుంది. అంటే బస్‌లోనే పర్సు పోయిందన్నమాట. నా వెనక ఆ అమ్మాయి నిలబడి వుంది. చూడటానికి ధనవంతురాలిగానే వుంది. అందులో కాలేజీ స్టూడెంటు. ఆ అమ్మాయి యీ పని చేసిందంటే నమ్మబుద్ధి కావడంలేదు. కానీ పర్సు తీయడానికి ఆ అమ్మాయికి మాత్రమే అవకాశం వుంది మరి!

పర్సులో మొత్తం నూట యాభయ్ రూపాయల దాకా వున్నాయి. ఆలోచించుకొంటూ యింటివైపు అడుగులు వేయసాగాను.

* * *

మరుసటి రోజు విక్టోరియా టాకీసు వద్ద నిలబడ్డాను. సందేహంలేదు. ఆ అమ్మాయే. ఏదో పుస్తకం చదువుకొంటూ నిలబడివుంది. పూర్తిగా రోజ్ కలర్ మేచింగ్ డ్రస్సులో వుంది. కళ్ళకు గాగుల్సున్నాయి.

అది ఆఫీసులు, కాలేజీలు వదిలే వేళ. అందుకే ఆ ప్రాంతమంతా రద్దీగా వుంది.

అంతలో బస్ రానే వచ్చింది!

తొందరగా బస్సెక్కి, కూర్చోడానికి సీటు సంపాయించాను. సీట్లన్నీ నిండిపోయాయి. కొంత మంది నిలబడ్డారు. వారి మధ్యలో ఆ అమ్మాయి

# జేబు దొంగ

నిలబడివుంది. నేను కూర్చొన్న సీటుకు రెండడుగుల ముందు ఆ అమ్మాయి నిలబడి వుండటం వల్ల ఆ అమ్మాయి నాకు క్లియర్‌గా కనబడుతోంది.

బస్ బయలుదేరింది.

బస్ చేసే కుదుపులకు ఆ అమ్మాయి ముందున్న అతనిమీద పడుతోంది. అందమయిన అమ్మాయి స్పర్శకు అతను ఆనందంతో తేలిపోతున్నాడు. అలా కొంతసేపు జరిగాక ఆ అమ్మాయి చేయి అతని ప్యాంటు బ్యాక్‌పాకెట్‌లోకెళ్ళి, అతి చాకచక్యంగా ఎంతో నేర్పుగా ఆ జేబులోని పర్సును తీసుకొని జాకెట్టులోకి దోపుకొంది.

సూపర్ బజారు దగ్గర అతను ఆమె వైపు పదే పదే చూసుకొంటూ దిగిపోయాడు. అతనికింకా తెలియదు అతని పర్సు స్థానభ్రంశం జరిగిందని.

బస్సు తిరిగి బయలుదేరింది !

ఇప్పుడు ఆ అమ్మాయి ముందు ఒక సేఠ్‌జీ నిలబడి వున్నాడు. అతను మాటిమాటికీ తన జేబును తడిమి చూసుకొంటున్నాడు. దాన్నిబట్టి అతని జేబు భారీగా వుందని తెలుస్తోంది. సేఠ్‌జీ చాలా జాగ్రత్తగా వున్నాడు. ఆ అమ్మాయి మెత్తని శరీరం సేఠ్‌జీ వీపును సున్నితంగా తాకుతోంది. ఇవన్నీ పట్టించుకొనే స్థితిలో లేడు సేఠ్‌జీ!

బస్ సడన్ బ్రేకుతో ఆగడంవల్ల ముందుకు తూలి పడబోయిన సేఠ్‌జీ రెండుచేతులతో పైనున్న రాడ్‌ను పట్టుకొన్నాడు. అవకాశంకోసం ఎదురు చూస్తున్న ఆ అమ్మాయి వెంటనే సేఠ్‌జీ జేబులో చేయి వేసింది. ఆ అమ్మాయి చేయి బయటకు తీయక మునుపే సేఠ్‌జీ ఆమె చేతిని పట్టుకొన్నాడు.

వెంటనే ఆ అమ్మాయి సేఠ్‌జీ చెంపపై ఛెళ్ళున కొట్టి "బ్లడీ బాస్టర్ ! చెయ్యి పట్టుకొంటావా?" అని గొడవ చేసింది.

బస్‌లోని అందరూ సేఠ్‌జీనే తిట్టారు, నేను తప్ప! అందరూ ఆ అమ్మాయినే సపోర్ట్ చేయడానికి కారణం ఆమె అందంగా వుండడమే. సేఠ్‌జీ అవమానంతో తల దించుకొన్నాడు.

ఆ అమ్మాయి సమయస్ఫూర్తికి ఆమెను మెచ్చుకోకుండా వుండలేకపోయాను. మామూలుగా అయితే ఆ అమ్మాయిని పట్టుకోలేము.

ఆలోచించాను !

తళుక్కున ఓ ఆలోచన తట్టింది. మరునాడు నా ప్లాను అమలుపరచడానికి తగిన పథకం వేసుకొన్నాను.

## 3

సమయం ఆరు దాటింది.

సూర్యుడు డ్యూటీని ముగించి యింటికి చేరుకొంటున్నాడు. విద్యార్థులు, ఉద్యోగస్థులుగూడా తమ డ్యూటీలు ముగించుకొని తమతమ యిళ్ళకు చేరుకోవాలని ఆరాటపడుతూ బస్టాపులో రాని వెధవ బస్సులకోసం ఎదురుచూస్తున్నారు.

టైం చూసుకొన్నాను!

ఆరు యిరవై !

ఆ అమ్మాయి దూరంగా వస్తూ కనిపించగానే మనసు కుదుటపడింది. నా వెనక జేబును ఓసారి తడిమి చూసుకొన్నాను. పర్సు రెడీగా వుంది.

ఎన్నో బస్సులు వస్తున్నాయి — వెళ్తున్నాయి. కానీ ఆమె ఏ బస్సులోనూ ఎక్కడంలేదు.

దూరంగా నిలబడ్డ నా మిత్రుడు విసుగ్గా నావైపు చూసాడు. నా మిత్రుడికి కళ్ళతోనే సమాధానమిచ్చి ఆమెనే గమనించసాగాను. నా మిత్రుడు పోలీసాఫీసర్. ప్రస్తుతం నా సలహామీద మఫ్టీలో వున్నాడు.

పదిహేనవ నంబర్ బస్సు వచ్చి ఆగింది. బస్ చాలా రద్దీగా వుంది. ఆమె గబగబా బస్‌వైపు అడుగులేయడం గమనించి నా ఫ్రెండ్‌కు సైగ చేసి బస్ వైపు కదిలాను.

బస్‌లో సరిగ్గా ఆమె ముందు నిలుచున్నాను. ఆమెకు కొద్ది దూరంలో నా ఫ్రెండ్ నిలబడివున్నాడు.

బస్ కదిలింది.

అపుడపుడు ఆమె శరీరం నన్ను తాకుతోంది. నేను వెనక్కి తిరిగిచూడలేదు. కావాలనే నేను నా రెండు చేతులు పైనున్న రాడ్‌పై వుంచాను.

కొంతసేపయ్యాక ఆ అమ్మాయి నా వెనక జేబులోని పర్సును తన జాకెట్టులోకి మార్చింది. నాలో నేను నవ్వుకొన్నాను.

రెండు క్షణాల తరువాత మెల్లిగా వెనక్కి తిరిగి చూసాను. ఆమె యిబ్బందిగా అటూయిటూ కదులుతోంది. నా పర్సుకు రాసిన "దురదగుంటాకు" పని చెయ్యడం మొదలెట్టిందన్నమాట. ఆ అమ్మాయి ముఖంలో క్షణంక్షణం రంగులు మారుతున్నాయి. ఛాతీ మీద నొక్కుకొంటూ యిబ్బందిగా అటూ యిటూ కదులుతోంది.

నేను మెల్లిగా కండక్టరు వద్దకెళ్ళి నా పర్సు నెవరో కొట్టేసినట్లు చెప్పాను. కండక్టరు బస్సునాపి అందరినీ చెక్ చేయడం మొదలుపెట్టాడు.

ఆ అమ్మాయి గోకుడు భరతనాట్యంలోకి మారింది. అందరినీ చెక్ చేయడం చూసిన ఆ అమ్మాయి ముఖం పాలిపోయింది. కంగారుగా అటూ యిటూ చూస్తోంది. బహుశా పర్సును వదులుకొనే ప్రయత్నంలో వున్నట్టుంది.

నేను నా ఫ్రెండుకు సైగ చేసాను.

నా ఫ్రెండు ఆమెను సమీపించి ఆమె జాకెట్టులోని పర్సును బయటికి లాగాడు. ఆమె కోపంగా ఏదో అనబోయింది. కానీ — నా ఫ్రెండ్ చేతిలోని ఐడెంటిటీ కార్డును చూసి గతుక్కుమంది.

ఆమె దురద ఎక్కువయింది. ఆమె అవస్థను చూసి బస్‌లోని వారందరూ చిన్నగా నవ్వుకొంటున్నారు. అవమానంతో తలదించుకొని గోక్కుంటూనే ఇన్‌స్పెక్టర్ వెంట నడిచిందా అమ్మాయి.

అంత అందమయిన అమ్మాయిని పట్టిచ్చినందుకు ఒకవైపు బాధగా వున్నా — ఇక ముందు ఆ అమ్మాయి వల్ల నాలాంటి సోదరులకు ఆర్థిక నష్టం వుండనందుకు సంతోషంగా వుంది.

అంతలో నా స్టాపింగ్ వచ్చింది.

దిగి వెళ్తూ యధాలాపంగా ఫ్రంట్ జేబులో చేయిపెట్టుకొన్న నాకు షాక్ తగిలినట్లయింది. ఫ్రంటు జేబులో వుండవలసిన నిజమైన పర్సు లేదు మరి!?! ★